రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెద్దారవీడు: మండలంలోని ఏనుగులదిన్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జె.శివలక్ష్మి, డి.జగన్‌మోహన్‌రెడిలు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీలో ఆడేందుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు బుధవారం తెలిపారు. జిల్లాలోని మంగమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీలో ఆడేందుకు ఎంపికయ్యారు. ఇద్దరు విద్యార్థులు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పీడీ దేవండ్ల చంద్ర పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు శివలక్ష్మి, జగన్‌మోహన్‌రెడ్డిలను స్కూల్ చైర్మన్ ఏర్వ పెద్దశివారెడ్డి, పీఈటీ బసులుపాటి సురేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బలుసుపాటి నాగరాజు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఈ నెల 24న ఒంగోలు జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో సత్తాచాటారు. విద్యార్థులు ఈశ్వర ప్రసాద్, పల్లవి, చైతన్యబాలలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి శిక్షణ ఇచ్చిన యోగా గురువులు బి.రంగస్వామి, ఎస్. సాయిరామ్, పీడీ సుబ్రహ్మణ్యం, విద్యార్థులను హెచ్‌ఎం మాల్యాద్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

పెద్దదోర్నాల: రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులకు పలువురు ప్రోత్సాహకాలు అందజేశారు. బుధవారం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పెద్దదోర్నాల, వై.చర్లోపల్లి, అయినముక్కల, గంటవానిపల్లె కాంప్లెక్స్ పని చేస్తున్న ఉపాధ్యాయులతో పాటు ఎంఈఓ మస్తాన్ నాయక్‌లు ప్రోత్సాహకాలు అందజేశారు. ఎంఈఓతో పాటు ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సుధాకర్, వెంకటయ్య, రామకృష్ణ నాయక్, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, నాగమూర్తి, ఫిజికల్ డైరక్టర్, రామానాయక్, హెచ్ రామానాయక్, యోగా మాస్టర్లు మహేశ్వరరెడ్డి, ప్రేమ్ చంద్ పాల్గొని 12 మంది క్రీడాకారులకు రూ.15 వేల నగదు అందజేశారు.

గణేష్ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిశెట్టి


పసుపుగల్లులో ఊరేగింపునకు హాజరైన ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

ముండ్లమూరు: మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని పెద ఉల్లగల్లు, పసుపుగల్లు, నాయుడుపాలెం, మారెళ్ల గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. పసుపుగల్లులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. మారెళ్ల గ్రామంలో ఎంపీపీ సుంకర సునీత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే మద్దిశెట్టి పరామర్శ


సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

దర్శి: మండలంలోని దేవవరం సర్పంచ్ జొన్నలగడ్డ సుషన్న సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ బుధవారం దేవవరం వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. భర్త కొర్నేలుతో మాట్లాడి మృతికి కారణాలడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షకీలా అమీన్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పులి వెంకటరెడ్డికి నివాళులు


నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి


నివాళులర్పిస్తున్న మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ, జెడ్పీటీసీ మారం

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని బొద్దికూరపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పులి వెంకటరెడ్డి మృతదేహానికి బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి నివాళులర్పించారు. వెంకటరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, పలువురు నాయకులు కూడా వెంకటరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

పుల్లర్‌పేటలో నీటి సమస్య పరిష్కారం

పొదిలి: పుల్లర్‌పేటలో అండర్ గ్రౌండ్ పైపులైన్ మరమ్మతులకు గురై స్థానికంగా కొంతకాలంగా బుగ్గవలం నీటి సరఫరా ఆగింది. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తీవ్రతను స్థానిక నాయకులు గౌస్ మొహిద్దీన్ తదితరులు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సమస్య పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. వెంటనే స్పందించిన నగర పంచాయతీ అధికారులు పైపులైను మరమ్మతులు చేపట్టారు. స్థానికులు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పౌరసరఫరాలపై ప్రత్యేక సమావేశం

గిద్దలూరు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాలపై మండల స్థాయి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం తహసీల్దార్ డి.సీతారామయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, రేషన్ సరఫరా అయ్యే విషయంలో జాప్యం లేకుండా సక్రమంగా నిర్వహించేలా చర్యలు ఏ విధంగా తీసుకుంటున్నామనే విషయాలపై చర్చించారు. పౌరసరఫరాల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులపై ఉందన్నారు. చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ వై.రామకృష్ణయ్య, ఈఓఆర్డీ చెన్నారావు, ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ

కొమరోలు: మండలంలోని గుండ్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేనయ్య ప్రమాదశాత్తు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో దద్దవాడ సర్పంచ్ భూమా రమణమ్మ, ఎంపీటీసీ నాగమ్మలు హుస్సేనయ్య భార్యకు 10 వేల రూపాయలు మట్టి ఖర్చుల కోసం బుధవారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

30 నుంచి షటిల్ టోర్నమెంట్

త్రిపురాంతకం: స్థానిక బీటీఆర్ ఇండోర్ షటిల్ కోర్టులో ఈ నెల 30 నుంచి షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. త్రిపురాంతకంలో మార్కాపురం, గిద్దలూరు, దర్శి, యర్రగొండపాలెం, వినుకొండ నియోజకవర్గాల స్థాయిలో షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 29వ తేదీలోపల తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 95737 31515, 83282 45662, 85559 41840 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ

పెద్దదోర్నాల: భారతదేశాన్ని స్వచ్ఛ భారత్‌గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలంటూ పంచాయితీ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మేజర్ పంచాయితీ సర్పంచ్ చిత్తూరి హారిక, ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, కార్యదర్శి మోహనరావు ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల నుంచి నటరాజ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నటరాజ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. చెత్త వేయకు, పాపం చేయకు.. అంటూ నినాదాలు చేశారు. పట్టణానికి చెందిన వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్ల జెడ్పీ హైస్కూల్లో గురుజాడ అప్పారావు జయంతి సందర్భంగా దేశభక్తి వారోత్సవాలను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ, సేవా భావాలు అలవర్చుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని హెచ్‌ఎం కె.వరదారెడ్డి కోరారు. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రంగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30న జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు

కంభం: మండలంలోని కందులాపురంలో ఈ నెల 30వ తేదీన జగనన్న సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జరిగే మెడికల్ క్యాంపు విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

సుంకేసులలో నామట్టి నాదేశం

పెద్దారవీడు: మండలంలోని సుంకేసులలో బుధవారం నామట్టి నాదేశం కార్యక్రమం సర్పంచ్ గుడ్డెపోగు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ప్రజలతో మట్టి, బియ్యం సేకరించిన కలశాలతో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పూర వీధుల్లో తిరుగుతూ అవగాహన కల్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ జన్మనిచ్చిన నేల తల్లిని స్వచ్ఛంగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేలా చేపట్టిన నా మట్టి నా దేశం కార్యక్రమం ఉద్దేశమన్నారు.

మంత్రి సొంత నిధులతో పారిశుధ్య పనులు

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మేజర్ పంచాయతీలో డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నాయన్న స్థానిక నాయకుల విజ్ఞప్తికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ స్పందించారు. వెంటనే తన సొంత నిధులు కేటాయించి పది రోజుల పాటు మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అందుకు అనుగుణంగా మంగళవారం నుంచి పనులు ప్రారంభించారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక, ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, గ్రామ పంచాయతీ సెక్రటరీ మోహన్‌రావులు గ్రామంలో నెలకొన్న సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సురేష్ సొంత నిధులు వెచ్చించి పనులు చేపట్టారు. సొంత నిధులతో జేసీబీ ఏర్పాటు చేసి గ్రామంలోని మురికి కాలువల్లో పూడిక తీసే పనులు చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలోని తిమ్మాపురం రహదారిలోని ప్రధాన డ్రైనేజీ కాలువను శుభ్రం చేశారు. దీంతో పాటు గ్రామంలోని పలు ప్రాంతాల్లోని చెత్త తొలగించడంతో మంత్రి సురేష్‌కు పెద్దదోర్నాల వాసులు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయితీ సర్పంచ్ చిత్తూరి హారిక, ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, గ్రామ పంచాయితీ సెక్రటరీ మోహనరావు, మండల కో ఆప్షన్ సభ్యులు పఠాన్ మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

మార్కాపురం టౌన్: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో విఘ్నేశ్వర నవరాత్రుల్లో భాగంగా బుధవారం ఘనంగా నిమజ్జన కార్యక్రమాలను కమిటీ సభ్యులు నిర్వహించారు. వివిధ విఘ్నేశ్వర మండపాల వద్ద మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్-2 అంజమ్మ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. నెహ్రూ బజారు, బంగారమ్మ గుడి వీధి, తూర్పువీధి, మున్సిపల్ కార్యాలయం, విజయ టాకీస్ రామాలయం వద్ద, శ్రీనివాస థియేటర్ లైన్, సిఫానీ బజారుతో పాటు వివిధ ప్రాంతాల్లో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం లడ్డూలకు వేలంపాట నిర్వహించారు. నెహ్రూ బజారులో వినాయకుని వద్ద ఉంచి లడ్డూను వేలంపాటలో రూ.1.10 లక్షలకు భాను హార్డ్‌వేర్ షాపు వారు కైవసం చేసుకున్నారు.

టౌన్ ఎస్‌ఐగా కోటేశ్వరరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ ఎస్‌ఐగా పి.కోటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇస్తానని, ట్రాఫిక్ నియంత్రణ, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షిస్తానని తెలిపారు. ప్రజలు ఎటువంటి ఇబ్బంది కలిగినా పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈయన ఒంగోలు నుంచి మార్కాపురం పట్టణ స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ శశికుమార్‌ను ఎస్పీ సస్పెండ్ చేసిన సంగతి ప్రజలకు విదితమే.

మహిళలకు ప్రభుత్వం పెద్ద పీట

దర్శి: అన్ని రంగాల్లో మహిళలు ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో వారికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సీడీపీఓ భారతి అధ్యక్షతన పోషణ మాసోత్సవాలు నిర్వహించగా, ఎంపీపీ సుధారాణి పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలు ఇస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కుసుమకుమారి, ఎంఈఓ కాకర్ల రఘురామయ్య, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

త్రిపురాంతకం: సేవ భారతి ఆధ్వర్యంలో ఆదియోగి ఫౌండేషన్ సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు సేవ భారతి జిల్లా ప్రముఖ్ రామ్‌గోపాల్ పేర్కొన్నారు. త్రిపురాంతకం కోయ నాగరాజు కాలనీ, పారిశుధ్య కార్మికులు వంద కుటుంబాలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సేవ భారతి ప్రపంచంలో 163 దేశాల్లో సేవ కార్యక్రమాలు చేస్తోందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్య, వైద్యం, పేదల అవసరాలకు, అభివృద్ధికి కృషి చేస్తోందని రామ్‌గోపాల్ వివరించారు. ఆదియోగి ఫౌండేషన్ నిర్వాహకుడు బొంతల కృష్ణ మాట్లాడుతూ తమ సంస్థ పేద వర్గాలకు చేయూత అందిస్తోందన్నారు. రానున్న సీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు పంపిణీ చేశామని చెప్పారు. విద్యార్థులకు పలకలు, పుస్తకాలు అందజేస్తున్నామని వివరించారు. సేవ భారతి ప్రముఖులు కె.మల్లికార్జునరెడ్డి, నాగబ్రహ్మచారి, నాగ రమేష్, అంజిరెడ్డి, మల్లికార్జున్,సూర్యనారాయణబాబు,రంగస్వామి పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల కాంప్లెక్స్ సమావేశం


హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పొదిలి: ఉర్దూ పాఠశాలల కాంప్లెక్స్ సమావేశం బుధవారం స్థానిక ఇస్లాంపేటలోని ఉర్దూ పాఠశాలలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉర్దూ డీఐ మొహిద్దీన్ నూతన బోధన పద్ధతులు వివరించారు. పిల్లలకు సులభతరంగా అర్థమయ్యేలా చేపట్టే బోధనా పద్ధతులు ఎలా ఉండాలి, బోధన తీరు గురించి చెప్పారు. తదుపరి విద్యార్థులకు పలు మెళకువలు సూచించారు. పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ అమానుల్లా, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరీమున్, హబీబుల్లా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కరీముల్లా బేగ్ తదితరులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కురిచేడు, దర్శి, ముండ్లమూరు, కనిగిరి, పొదిలి మండలాల ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

పొదిలి: స్థానికంగా అందుబాటులో ఉండే పోషకాహారానికి ప్రాధాన్యం ఇస్తే మేలు జరుగుతుందని సీడీపీఓ సుధామారుతి చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఐదో సచివాలయం పరిధిలో పోషణ మాసోత్సవ కార్యక్రమాలు జరిగాయి. సుధామారుతి మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం సమయానుకూలంగా తీసుకుంటే ఆరోగ్యవంత శిశువుకు జన్మనిస్తారని చెప్పారు. స్థానికంగా ఉండే పోషకాలు తక్కువ ఖర్చుతో ఉంటాయన్నారు. పాలు, కోడిగుడ్లు, ఆకు కూరలు, చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంటి ఆవరణల్లో సేంద్రియ ఎరువులతో పెంచే ఆకుకూరలు తీసుకుంటే రక్తహీనత అధిగమించవచ్చన్నారు. సీమంతాల కార్యక్రమానికి హాజరైన నగర పంచాయతీ కమిషనర్ డానియేల్ జోసఫ్ మాటాడారు. సీమంతాలు చేశారు.